www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 3 ఆగస్టు 2023
5
పశ్చిమ గోదావరి



'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ'ను వినియోగించుకోండి : జెసి

భీమవరం :గర్భిణులు, బాలింతలు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద టేక్ హోం రేషన్ కిట్స్‌ను గర్భిణులకు, బాలింతలకు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెసి రామ్‌సుందం రెడ్డితో కలిసి స్థానిక ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి. ఐసిడిఎస్ అధికారి బి.సుజాతారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లై డిఎంటి శివరామప్రసాదు, డిఎస్ఒ ఎన్.సరోజ, ఎపి క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ మేడిది జాన్సన్, ఎపి మహిళా కమిషన్ మెంబర్ బూసి వినీత, రాష్ట్ర బాల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు.



కనకాయలంక కాజ్‌వేపై యథావిధిగా కొనసాగుతున్న రాకపోకలు

సాధారణ స్థితికి గోదావరి

వరద నుండి తేరుకున్న కనకాయలంక కాజ్ వే

యథాతథంగా రాకపోకలు

ప్రజాశక్తి - యలమంచిలి

పది రోజులుగా లంక గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన గోదావరి వరద పూర్తిగా తగ్గి బుధవారం సాయంత్రానికి సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఇప్పుడిప్పుడే బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. కనకాయలంక గ్రామానికి ప్రధాన రహదారిగా ఉన్న కాజ్‌వే గత పది రోజులుగా వరద నీటిలో మునిగిపోవడంతో ఆ గ్రామ ప్రజలు ఇప్పటి వరకూ పడవల్లో ప్రయాణించేందుకు ఎంతో ప్రయాసపడే పరిస్థితి ఉండేది. అయితే కాజ్ వే వరద నుండి పూర్తిగా బయటపడటంతో ఆ గ్రామస్తులు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నారు, యలమంచిలిలంక, లక్ష్మీపాలెం, గంగడ పాలెం, దొడ్డిపట్ల తదితర గ్రామాల్లో వరద పూర్తిగా తగ్గినప్పటికీ ఆయా గ్రామాలలో ప్రధాన రహదారులపై బురద నిండిపోవడంతో ప్రయాణాలు సాగించేందుకు కష్టంగా మారింది.



ధర్నా చేస్తున్న నాయకులు, స్వీపర్లు

సమస్యలు పరిష్కరించాలని స్కూల్ స్వీపర్ల ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు ఆరు నెలల బకాయి వేతనాలు తక్షణం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన, ధర్నా నిర్వహించారు. స్కూల్ స్వీపర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఆరు నెలలు బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని స్కూల్ స్వీపర్లను పర్మినెంటు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు యత్నించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి, జిల్లా కార్యదర్శి ప్రతాప్ మాట్లాడుతూ 20 ఏళ్లగా స్కూల్ స్వీపర్లకు నెలకు కేవలం రూ.నాలుగు వేలు మాత్రమే ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ స్వీపర్లు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వీరి సమస్యలు వినేందుకు, పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటి వరకూ ఉన్న మున్సిపల్ స్కూళ్లను ప్రభుత్వానికి అప్పగించడం వల్ల ఆరు నెలలుగా వేతనాలు తమకు సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి ప్రతినెలా వేతనాలు సక్రమంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ టి.సుధాకర్‌ని కలిసి సమస్యలు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ మున్సిపల్ పరిధిలో మార్చి నెల వరకూ స్కూల్స్ ఉన్నాయని, ఫిబ్రవరి, మార్చి నెలలకు తక్షణం బిల్లు పెట్టి వేతనాలు వేస్తామని హామీ ఇచ్చారు. ఇకనుండి మండల విద్యాశాఖాధికారి వారి నుండి వేతనాలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, స్వీపర్ల యూనియన్ అధ్యక్షులు పి.శారద, కార్యదర్శి కె.సత్యవతి, పి.లక్ష్మి, టి.బంగారమ్మ, పి.సత్యవతి, బి.ఆదిలక్ష్మి, కె.ధనలక్ష్మి, సిహెచ్.హేమలత, జోగి శ్రీరామలక్ష్మి, సప్పా లక్ష్మి, సీతామహాలక్ష్మి, రమ్య, ఎన్.రత్నం, సూర్యకుమారి పాల్గొన్నారు.

మోకాళ్లలోతు నీటిలో జగనన్న కాలనీలు

మౌలిక సదుపాయాలు కరువు


టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలి

వరదలకు నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలి

మీడియాతో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

'జిల్లాలో జగనన్న కాలనీలు మోకాళ్లలోతు నీటిలో ఉన్నాయి. కనీసం రోడ్ల సౌకర్యాలు కూడా లేవు. ఈ కాలనీలో నివాసం సంగతి పక్కన పెడితే కనీసం గృహాలు నిర్మించుకునేందుకు వెసులుబాటు లేదు. తక్షణం కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి' అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జగనన్న కాలనీలు మునిగిపోయి మోకాళ్ల లోతు నీరు చేరిందన్నారు. ఈ కాలనీలు అధ్వాన స్థితిలో ఉన్నాయన్నారు. ప్రజలు జీవించడానికి ఏ మాత్రమూ సౌకర్యంగా లేవన్నారు. చాలా చోట్ల పూడికలు చేయకుండా గోతులుగానే ఉన్నాయని తెలిపారు. ఇల్లు కట్టినచోట కూడా రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు ఏమీ లేవన్నారు. ఇళ్లు నిర్మించిన చోట్ల ఎంతమాత్రమూ నివాసయోగ్యంగా లేవన్నారు. బిక్కు బిక్కుమంటూ నివసించాల్సిన పరిస్థితి ఉందన్నారు. వర్షం వస్తే బురదమయంగా మారడంతో పాటు విద్యుత్ సౌకర్యం లేక కటిక చీకటిలో ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం తక్షణం జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న బలరాం

టిడ్కో గృహాలు లబ్ధిదారులకు స్వాధీన పరచాలి

టిడ్కో గృహాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు కేటాయించకపోవడం సిగ్గుచేటని బలరాం విమర్శించారు. లబ్ధిదారులు తినోతినకో వేలాది రూపాయలు డిపాజిట్లు కట్టారన్నారు. నేడు ఆ డిపాజిట్లకు వడ్డీలు పెరిగి ఆర్థిక ఇబ్బందులతో లబ్ధిదారులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా నేటికీ అద్దె ఇళ్లల్లోనే నివాసం ఉంటున్న పరిస్థితి ఏర్పడిందని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంటి అద్దెలు కూడా అధికమవడంతో వాటిని చెల్లించలేక నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అద్దెలు కడుతూ, మరోవైపు ఇళ్లకు తెచ్చిన రుణాలకు వడ్డీలు కడుతూ విపరీతమైన రుణభారం మోస్తున్నారన్నారు. తక్షణం లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లను నిర్మించిన ప్రతిచోటా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

నష్టపోయిన రైతులను, కుటుంబాలను ఆదుకోవాలి

అకాల వర్షాల వల్ల సతమతమవుతున్న పరిస్థితుల్లో జిల్లాలోని లంక గ్రామాల్లో వచ్చిన వరదకు అక్కడి ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారని బలరాం తెలిపారు. యలమంచిలి, ఆచంట, పోడూరు, పెనుగొండ, నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన తీరగ్రామాలు, లంక గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా పంట నష్టం తీవ్రంగా సంభవించిందన్నారు. మరికొన్ని రోజుల్లో పంట చేతికొస్తుందని, ఈ తరుణంలో వరదలు ముంచెత్తడంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన పంటలకు, దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రోగాలు ప్రబలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రజారోగ్యాన్ని కాపాడే విధంగా చర్యలను ముమ్మరం చేసి వైద్య శిబిరాలు కొనసాగించాలన్నారు. నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకోవడంతో పాటు వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

ఇంద్ర ధనుష్‌తో చిన్నారులకు నూరుశాతం టీకాలు

ఆరోగ్యవంతమైన సమాజం తీర్చిదిద్దాలి

చిన్నారులకు, గర్భిణులకు తప్పనిసరిగా వేయించాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం ద్వారా చిన్నారులకు, గర్భిణులకు నూటికి నూరుశాతం అన్ని రకాల టీకాలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజంగా తీర్చిదిద్దాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్ ఫోర్సు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మిషన్ ఇంద్ర ధనుష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్ల వరకూ, గర్భిణులకు నూటికి నూరుశాతం రోగ నిరోధక టీకాలు వేయాలన్నారు. ఫేజ్ –5 మొదటి రౌండు ఈ నెల ఏడో తేదీ నుండి 12వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈలోపుగా ఇప్పటివరకూ ఎంత మందికి వేశారు.. ఇంకా ఎంత మంది మిగిలి ఉన్నారు.. వంటి వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధ, ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రవీణ్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, పట్టణ, గ్రామీణ వైద్యాధికారులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



పతాక ర్యాలీలో విద్యార్థులు

భీమవరంలో భారీ జాతీయ పతాక ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మన జాతీయ పతాకానికి ప్రపంచంలోనే గుర్తింపు ఉందని, మువ్వన్నెల జెండా స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాట స్ఫూర్తిని నింపిందని భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. బుధవారం జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతూ ఈ కళాశాల దంతులూరి నారాయణరాజు 1945లో స్థాపించారని, స్వాతంత్ర్యం రాకముందే నిర్మించారని, ఇదే జాతీయ జెండాతో భీమవరం పట్టణంలో అనేక ఉద్యమాలు జరిగాయని, స్వాతంత్ర్యం అనంతరం రెండు వార్డులుగా భీమవరం పేరుగాంచిందన్నారు. నిర్వాహకులు చెరకువాడ రంగసాయి పింగళ వెంకయ్య స్ఫూర్తితో జాతీయ సామరస్య ప్రతిజ్ఞ చేశారు.

ముంపు బాధితులకు మాంసం, కోడిగుడ్లు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో వశిష్ట గోదావరి తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఈ సందర్భంగా ముంపునకు గురైన లంక గ్రామ ప్రజలకు ఆచంట ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ఆదుకుంటున్నారు. బుధవారం లంక గ్రామ ప్రజలకు వెయ్యి కేజీల కోడి మాంసం, పది వేల కోడిగుడ్లు ఎంఎల్ఎ సొంత నిధులు ఖర్చుపెట్టి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. లంక గ్రామ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. లంక గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా బ్లీచింగ్ చల్లించి, మంచినీటిని క్లోరినేషన్ చేయిస్తున్నామన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు, కడలి వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, వేమన గాంధీ, సత్యనారాయణ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

6011 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

వరద తాకిడికి గురైన 6,011 గృహాల ప్రజలకు నిత్యావసర వస్తువుల పంపిణీ పూర్తి చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచంటలో 12 గ్రామాలు, నరసాపురంలో ఒక గ్రామం, యలమంచిలిలో 17 గ్రామాలు మొత్తం 30 లోతట్టు గ్రామాలు ముంపునకు గురయ్యాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో 6,011 కుటుంబాల్లో 18,306 మంది ఉన్నారని తెలిపారు. యలమంచిలిలో ఒకటి, ఆచంటలో 12 మొత్తం13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, 124 మంది గర్భిణులను, 127 మంది బాలింతలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు, 25 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వరద తాకిడికి గురైన యలమంచిలి మండలంలోని 4,235, నరసాపురం మండలంలోని 86, ఆచంటలో 1,690 మొత్తం 6,011 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ నేటితో పూర్తిచేశామన్నారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీలు చొప్పున 1,502.75 క్వింటాళ్ల బియ్యం, ప్రతీ కుటుంబానికి ఒక్కొక్కటి కేజీ చొప్పున కందిపప్పు, పామాయిల్ లీటర్, ఉల్లిపాయలు కేజీ, బంగాళదుంపలు కేజీ పంపిణీ చేశామని తెలిపారు. వంకాయలు 686 కుటుంబాలకు, పచ్చిమిర్చి 172 కుటుంబాలకు పంపిణీ చేశామని వివరించారు. యలమంచిలిలో 25 మెట్రిక్ టన్నులు, పెనుగొండలో 12 మెట్రిక్ టన్నులు, ఆచంటలో 28 మెట్రిక్ టన్నులు పశు దాణా పంపిణీ చేశామని పేర్కొన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలోని 44 కుటుంబాలకు ప్రత్యేక సాయం కింద రూ.87 వేలు అందజేశామని తెలిపారు.

పారిశుధ్య పనులకు 30 బృందాల ఏర్పాటు

భీమవరం డివిజన్ పరిధిలో అధిక వర్షాల కారణంగా ఇప్పటి వరకూ మూడు గృహాలు పాక్షికంగా, రెండు గుడిసెలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. వరద ముంపు గ్రామాల్లో పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేపట్టామని, వీటి కోసం 30 బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. పారిశుధ్యం, డ్రెయిన్లు శుభ్రపరచడానికి 55 మంది కార్మికులు, తాగునీటి ట్యాంకులు, చెరువులు శుభ్రపరచి క్లోరినేట్ చేయడానికి 22 మందిని, పైపులైన్ లీకేజీలను అరికట్టడానికి ఒకరికి విధులు కేటాయించామని తెలిపారు. 27 ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టామని పేర్కొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు పూర్తిజీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

4న డిఇఒ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - భీమవరం

బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి రెండు నెలలు పూర్తికావస్తున్నా బదిలీ అయిన ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించకపోవడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని లేకుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా ఈనెల నాలుగో తేదీన భీమవరం కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామన్నారు. జూన్ 12 నాటికి బదిలీలు, జూన్ 25 నాటికి వివిధ కేడర్ల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయినా, కేడర్ స్ట్రెంత్ అప్‌డేట్ చేస్తున్నామనే పేరుతో ఇప్పటి వరకూ జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. బదిలీల ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించామని చెప్పిన విద్యాశాఖ, జీతాలు సకాలంలో చెల్లించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. జీతాల మీదే ఆధారపడే ఉపాధ్యాయులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం తగదని తెలిపారు. విద్యాశాఖ జూన్, జూలై నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ చేపట్టనున్న నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యానిమేటర్లకు 5జి ఫోన్లు ఇవ్వాలి

పెనుమంట్ర :యానిమేటర్లకు నాణ్యమైన 5జి మొబైల్ ప్రభుత్వం ఇవ్వాలని విఒఎ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అజయ్ కుమారి డిమాండ్ చేశారు. బుధవారం ఎపి వెలుగు (యానిమేటర్ల) ఉద్యోగుల సంఘం, విఒఎల హక్కుల కోసం జీపుజాత రెండో రోజు మార్టేరు చేరుకుంది. అనంతరం మార్టేరు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో అజయ్‌కుమారి మాట్లాడుతూమూడేళ్ల కాల పరిమితిని రద్దు చేసి గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.పది లక్షలు చేయాలని కోరారు.

4న దళిత, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం

కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా ఈనెల నాలుగో తేదీన దళిత, ప్రజా సంఘాలతో జిల్లాస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘాల జిల్లా కార్యదర్శులు కె.క్రాంతి బాబు, జెక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉభయ సంఘాలు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి. రాష్ట్రంలో దళితుల సమస్యల పరిష్కారం కోసం దళిత రక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా దళితుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళతామన్నారు. దళిత రక్షణ యాత్ర జయప్రదం కోసం అన్ని దళిత, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం భీమవరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పది గంటలకు జరుగుతుందన్నారు. జిల్లాలో అన్ని దళిత, ప్రజా సంఘాలు జిల్లా, రాష్ట్ర నాయకత్వం హాజరై దళిత సమస్యలపై సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలపాలని కోరారు.

మణిపూర్ అల్లర్ల కారకులను కఠినంగా శిక్షించాలి



తాడేపల్లిగూడెంలో...

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మణిపూర్‌లో హింసకాండకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నవాబుపాలెంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద కార్యక్రమం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ మణిపూర్‌లో ప్రజలకు భద్రత లేకుండా చేసి ఆర్ఎస్ఎస్ మతోన్మాద సంస్థలు ఆ రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించడానికి మత ఘర్షణలు సృష్టిస్తుందన్నారు. మహిళలపై అత్యాచారాలు జరిపి హత్యలు చేసి రాష్ట్రాన్ని మారణకాండగా మార్చారన్నారు. ఇప్పటికీ నిందితులపై చర్యలు తీసుకోవడానికి బిజెపి ముందుకు రావడంలేదన్నారు. ఇలాంటి ఘటనలపై రాష్ట్రంలో పాలక పార్టీ నాయకులు గాని, ప్రతిపక్ష పార్టీ నాయకులు పవన్‌కల్యాణ్ గాని మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మహిళలు నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కండెల్లి కమలకుమారి, కొల్లి అక్కమ్మ, కండెల్లి విజయ, గడ్డం లక్ష్మి, కండెల్లి కుమారి, ఉండ్రాజవరపు కుమారి, పేకేటి నాగమణి, కండెల్లి రాణి, ఉప్పాటి పార్వతి, రుద్రా సత్యవతి, గడ్డం నాగమణి పాల్గొన్నారు.

పోడూరు :మణిపూర్‌లో జరిగిన ఘోర ఘటనలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి నిందితులను కఠినంగా శిక్షించాలని పోడూరు మండల యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆర్ఐ కందుల రాంబాబుకు, సబ్ ఇన్‌స్పెక్టర్ డి.రామ్‌కుమార్‌కి వినతిపత్రం అందించారు. అనంతరం పోడూరు మార్కెట్ వద్ద నుంచి కవిటం ప్రధాన రహదారుల జంక్షన్ వరకు శాంతియుతమైన నిరసన ర్యాలీని నిర్వహించారు. కవిటం జంక్షన్‌లో మానవహారాన్ని, ప్రత్యేక మోకాళ్ల ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ప్రజలు, క్రైస్తవులపై దాడులను, చర్చిల ధ్వంసంపై కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడూరు మండల యునైటెడ్ పాస్టర్స్



పోడూరులో...

అసోసియేషన్ పాస్టర్స్ అధ్యక్షులు జిఎస్.కుమార్, వైస్ ప్రెసిడెంట్ బిడివి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.యోసేపురాజు, కోశాధికారి వై.కిషన్ కుమార్, జాయింట్ సెక్రటరీ బి.ప్రకాష్‌రాజ్, జాయింట ట్రెజరర్ ఎ.రాజబాబు, ఎన్‌సిసి మీడియా వింగ్, రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల సాల్మాన్ దొర, సిహెచ్.రాజు, కందికట్ల సహోదరులు, ఆర్.మధు, జివివి.సుబ్బారావు, కె.నోవహు, జై.జాన్‌పాల్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే నా తల్లి ప్రాణం తీసింది

ఇల్లు అక్రమంగా కూల్చేశారని బాధితుడు ఆవేదన

న్యాయం కోరుతూ మృతదేహంతో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి - ఆకివీడు

అధికారుల నిర్లక్ష్యం, పెట్టుబడిదారుల స్వార్థం కలిసి తమ తల్లి ప్రాణాలు తీశాయంటూ అంటూ మెర్ల సుబ్బరాజు, ఆయన కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతదేహంతో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అధికారులు తమ ఇల్లు అక్రమంగా తొలగించడంతో బెంగ పెట్టుకొని ఆందోళనతో మానసిక వేదన అనుభవిస్తున్న సమయంలో గత వారం రోజులుగా కురిసిన భారీ వానలకు శారీరకంగా దెబ్బతిని ఆమె చనిపోయిందని వాపోయారు. స్థానిక ఉప్పుటేరు మలుపు వద్ద దుంపగడప పంచాయతీ పరిధిలో రోడ్డును ఆనుకుని ప్రభుత్వ ఆక్రమిత భూమిలో సుమారు రెండు దశాబ్దాలుగా నాలుగు కుటుంబాల వారు కాపురం ఉంటున్నారు. అయితే ఆ రోడ్డుకు వెనుక భాగాన ఉన్న పొలం యజమాని తనకు దారి లేదంటూ హైకోర్టుకు వెళ్లి దారిలో ఉన్న అడ్డంకులు తొలగించాలని కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు స్థానిక అధికారులు గత జూన్ 26వ తేదీన రోడ్డు మీద నివాసం ఉంటున్న నాలుగు కుటుంబాల వారిని ప్రత్యామ్నాయం చూపకుండానే ఖాళీ చేయించారు. ప్రత్యామ్నాయం చూపించిన వెంటనే ఖాళీ చేస్తామని ఎన్నిసార్లు చెప్పినా తమ గోడు ఎవరూ పట్టించుకోలేదని మెట్ల సుబ్బరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లి మానసిక శారీరక వేదనతో మరణించడానికి అధికారులే కారణమన్నాడు. అధికారులపై చర్యలు తీసుకుని తమకు అత్యవసరంగా ఇల్లు కేటాయించకపోతే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించారు. తహశీల్దార్ కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమానికి హాజరవ్వడంతో డిప్యూటీ తహశీల్దార్ ఉన్నతాధికారులకు తెలిపారు. ఆర్‌డిఒ దాసిరాజు తాను వెంటనే పరిశీలిస్తానని, న్యాయం చేస్తానని ఫోనులో హామీ ఇచ్చినప్పటికీ వారు తగ్గలేదు. ఇప్పటికే తమకు రెండుసార్లు న్యాయం చేస్తానని చెప్పి అన్యాయం చేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.



ఆర్‌డిఒ దాసిరాజుతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ఎంఎల్ఎ రామరాజు రంగ ప్రవేశం

ఆందోళనకారులను మధ్యాహ్నం ఎంఎల్ఎ మంతెన రామరాజు పరామర్శించారు. న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఆర్‌డిఒ దాసిరాజుతో మాట్లాడి వారం రోజుల్లోగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ స్థలాలు కేటాయించి ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక దంతులూరి నారాయణరాజు కళాశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను బోధించటమే కాకుండా ప్రతిభ కలిగిన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక సాయం చేయటంలో ముందుంటుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివిఎస్.శాంతకుమారి తెలిపారు. తమ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థిని ప్రియాంకకు కళాశాల పాలకవర్గ అసిస్టెంట్ సెక్రటరీ కె.శివరామరాజు కళాశాల ఫీజుల నిమిత్తం రూ.ఆరు వేలు అందించారు. ఈ సందర్భంగా కె.శివరామరాజు మాట్లాడుతూ ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుక బడిన విద్యార్థులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తన వంతు సాయం అందించానని తెలిపారు.

గుండెపోటుతో సర్పంచి మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర


అప్పారావు (ఫైల్)

సత్యవరం సర్పంచి చుక్కా అప్పారావు (61) బుధవారం గుండెపోటుతో భీమవరం ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు మద్రాసులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. అప్పారావు కాంగ్రెస్ హయాంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించారు. ప్రస్తుతం టిడిపి నుంచి సర్పంచిగా పోటీ చేసి గెలుపొందారు. ఆయన గత ఎనిమిది సంవత్సరాలుగా బిపి, లివర్ సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఉండేవారు. కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి టిడిపి నాయకులు సంతాపం తెలిపారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు శ్మశానవాటికను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో సుందరంగా పార్కు మాదిరిగా ఈ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తే వైసిపి అధికారంలోకి కనీసం మెయింటెనెన్స్ పనులు కూడా సరిగ్గా చేయకపోవడంతో లైట్లు, టైల్స్ పాడైపోయాయన్నారు. వెంటనే మళ్లీ ఈ శ్మశానవాటికను సుందరంగా మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శ్మశానవాటిక రోడ్డులోనే చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.


లబ్ధిదారుల బ్రోచర్‌ను అందిస్తున్న పివిఎల్.నరసింహరాజు

పేదల సంక్షేమమే ధ్యేయం : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి సిఎంగా గెలిపించాలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు తెలిపారు. మండల పరిధిలోని ఏలూరుపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ఈసారి వైసిపి జెండాను ఎగురవేస్తామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపిలు పెన్మత్స శిరీష విశ్వనాథరాజు, సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, వైసిపి నాయకులు మంతెన రామకృష్ణంరాజు, వ్యవసాయ సలహా మండల కమిటీ ఛైర్మన్ రుద్రరాజు కృష్ణంరాజు, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి కోశాధికారి మంతెన వెంకట రవివర్మ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కొడమంచిలి రైతు కమ్యూనిటీ కార్యాలయంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా స్వచ్ఛ పర్యవేక్షణ కార్యక్రమం ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ కొడమంచిలిలో ప్రతిఒక్కరూ తడి, పొడి చెత్తకు బుట్టలను ఉపయోగించుకోవాలని కోరారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రెండు వేల బుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, యల్లమెల్లి బేబి రాజేష్, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్ బాలనాగు నరేష్, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ జ్యోషిల

ఆలమూరులో 'పొలంబడి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరి పంటపై అనవసర పిచికారీ చేయడం వల్ల మనిషిపై విష ప్రభావం చూపుతుందని ఎఒ ఎ జ్యోషిల అన్నారు. ఆలమూరులో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోషిల మాట్లాడుతూ 25 ఎకరాల్లో 30 మంది రైతులను ఎంచుకొని 14 వారాలపాటు పొలంబడి కార్యక్రమం చేసి సార్వా వరి సాగు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు, విఎఎలు, రైతులు కోట సుబ్బారావు, కలిదిండి వెంకటరామరాజు, ద్వారంపూడి వెంకటరెడ్డి, జిఎస్.వెంకటరెడ్డి, జి.సూరిబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని మహాదేవపట్నం గ్రామ శివారులో పేకాట స్థావరంపై బుధవారం తెల్లవారుజామున పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,700 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఉండి ఎస్ఐ గంగాధరరావు తెలిపారు.

ఆదర్శప్రాయులు పింగళి వెంకయ్య

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పాలకోడేరు

జాతీయ జెండాలో దేశ ఔన్నత్యం దాగి ఉందని, ఆ విధంగా జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య చరిత్రలో నిలిచిపోయారని సచివాలయ గృహసారథుల మండల కన్వీనర్ పాల రాధాకృష్ణ అన్నారు. గరగపర్రు శ్రీ గాయత్రి విశ్వకర్మ పంచ గ్రామ సంఘం ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాల రాధాకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సైన్స్ పీడీ మంతెన సత్యనారాయణరాజు, సోమేశ్వర స్వామి దేవాలయ ఛైర్మన్ చింతలపాటి బలరామరాజు, మంతెన రామరాజు, మాజీ సర్పంచి చింతలపాటి సూర్యనారాయణరాజు, వత్సవాయి రామరాజు, సంఘం సభ్యులు పిరిడి రమేష్, వెంకన్న పాల్గొన్నారు.


పాలకోడేరులో...

పోడూరు : స్వాతంత్ర సమరయోధుడు, భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 146వ జయంతిని చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్ పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గేయాలు ఆలపించారు.

ఉండి : భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఉండి శివాలయం ప్రధాన అర్చకులు సన్నిధిరాజు కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉండి సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న పింగళి వెంకయ్య విగ్రహానికి సన్నిధిరాజు కృష్ణ పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ భారతదేశానికి ఒక జాతీయ జెండాను ఏర్పాటు చేయాలనే ఆశయంతో సుమారు 30 దేశాల జాతీయ జెండాలను పరిశీలించి మువ్వన్నెల జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య ఆదర్శప్రాయుడన్నారు. పింగళి వెంకయ్యని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ రాము, మాసాబత్తుల రామకృష్ణ, ఏలూరుపాటి ఫణి, తాడేపల్లి కిరణ్ పాల్గొని పింగళి వెంకయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాలకు పూలమాలలు వేశారు.

శివన్నారాయణ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరులో సిపిఎం గ్రామ శాఖ సమావేశం తాలాబత్తుల గాంధీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత మంగళవారం మరణించిన సీనియర్ నాయకుడు రెడ్డి శివన్నారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాఖా కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి మాట్లాడుతూ శివన్నారాయణ పార్టీకి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలిసెట్టి సింహచలం, వెల్లుటి నాగేశ్వరరావు, కిలారి సాంబయ్య, దాడి గౌరమ్మ, చివటపు ఆంజనేయులు, కుక్కల గంగాజలం, మారిశెట్టి పెద కాపు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి సెమినార్

శ్రీనివాస్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర స్థాయిలో ఈ నెల మూడో తేదీన జరిగే సెమినార్‌కు పొలమూరు ఎంపిపి స్కూల్ నాగాలదిబ్బ ప్రధానోపాధ్యాయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెఎన్‌వి.శ్రీనివాస్ ఆహ్వానం అందుకున్నట్లు తెలిపారు. విజయవాడలో గేట్ వే హోటల్‌లో జరిగే కాన్ఫరెన్స్‌కు హాజరు కావాల్సిందిగా పిలుపు వచ్చిందన్నారు. ఈ సెమినార్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి 39 మందిలో శ్రీనివాస్ ఒకరన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాలు శ్రీనివాస్‌ను అభినందించారు.

రక్తహీనతను తగ్గించేందుకు 'జగనన్న సంపూర్ణ పోషణ'

ప్రజాశక్తి - పెనుమంట్ర

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గించేందుకు జగనన్న సంపూర్ణ పోషణ ఎంతగానో దోహదపడుతుందని జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. మార్టేరు గౌరీశంకర దేవాంగుల కళ్యాణ మండపంలో మండల స్థాయి జగనన్న సంపూర్ణ పోషణ లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి గౌరీ సుభాషిణి సంపూర్ణ పోషణ పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు చాలా ఔషధంలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్టేరు సర్పంచి మట్టా కుమారి, నెగ్గిపూడి సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి, వెలగలేరు సర్పంచి మధువాణి పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంపిపి

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థుల విషయంలో అలసత్వం వహించకుండా మంచి పౌష్టికాహారం అందించాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. వల్లూరు బాలికల సంక్షేమ వసతి గృహాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను తనిఖీ చేశారు. గర్భిణులకు ప్రసవ సమయంలో సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, ఉప సర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, సంక్షేమ బాలికల వసతిగృహం అధికారిని నరసమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కాళ్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. పెదఅమిరం వైసిపి పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉండి నియోజకవర్గంలో లబ్ధిదారులకు 90,851 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. సురక్ష కార్యక్రమానికి సహకరించిన ప్రభుత్వ యంత్రాంగానికి, సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు, వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు పి.శిరీష విశ్వనాథరాజు, కటారి జయలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు యండగండి శ్రీను, ఆకివీడు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, పార్టీ మండల అధ్యక్షులు పివిఆర్‌కె.ఆంజనేయరాజు, గుండుగొల్లు ధనరాజ్, కటిక శ్రీదేవి, పార్టీ నాయకులు గుండా సుందర రామినాయుడు, జామి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

'ఎస్ఆర్‌కెఆర్'లో 11న వర్క్‌షాపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యాసంస్థల్లోని ఇంగ్లీష్ అధ్యాపకులకు ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఇటిఎస్)తో కలిపి సంయుక్తంగా ఈ నెల 11వ తేదీన ఒకరోజు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. ప్రధానంగా అంతర్జాతీయ విద్యాసంస్థల్లో చేరే విద్యార్థులకు నిర్వహించే టోఫెల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంగ్లీషులో శిక్షణ అందించేందుకు ప్రధానంగా ఈ వర్క్‌షాపులో అధ్యాపకులకు శిక్షణ ఉంటుందన్నారు. సందర్భంగా వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టర్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ విభాగం హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి మాట్లాడుతూ టోఫెల్ పరీక్ష రాసే విద్యార్థులకు కళాశాల స్థాయిలోని అధ్యాపకులు శిక్షణ ఇచ్చేందుకు ఇటువంటి వర్క్‌షాపు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇటిఎస్ ఢిల్లీ హెడ్ రష్మీ గేరా వర్క్‌షాపులో అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ అందిస్తారన్నారు. దీంతో ప్రధానంగా అధ్యాపకులు బాగా ప్రావీణ్యం సంపాదించి, తమ నైపుణ్యాన్ని కూడా పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీతో పాటు కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం

ప్రజాశక్తి - మొగల్తూరు

సేవా కార్యక్రమాలను విరివిగా నిర్వహించి లయన్స్ క్లబ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆ క్లబ్ సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ ఎన్‌వివిఎస్.పాపారావు నాయుడు నూతన కార్యవర్గానికి సూచించారు. బుధవారం సాయంత్రం మొగల్తూరులోని గుబ్బల నాగరాజు కమర్షియల్ కాంప్లెక్స్‌లో క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మొగల్తూరు శాఖ అధ్యక్షుడిగా గుబ్బల వీర వెంకట నాగరాజు, కార్యదర్శిగా కె.నాగేశ్వరరావు, కోశాధికారిగా వుద్దగిరి వెంకన్న, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తృతం చేసి క్లబ్‌కు మంచి పేరు తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఛైర్‌పర్సన్ ఫనింద్రుడు, జోనల్ ఛైర్‌పర్సన్ కె.రోజారమణి, రాయుడు లక్ష్మణుడు, కె.సాంబమూర్తి, సిహెచ్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - ఆచంట

చదువులో మెరిట్, అనాథ, వికలాంగుల విద్యార్థులను ఆదుకునేందుకు బాల్యమిత్ర సేవా ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని ఆ ట్రస్ట్ ఛైర్మన్ గుబ్బల శివరామకృష్ణ అన్నారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యమిత్ర సేవా ట్రస్ట్ 1989 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ట్రస్ట్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పింగళి వెంకయ్య జయంతి పురస్కరించుకుని ఇద్దరు మెరిట్ విద్యార్థులకు రూ.పది వేల నగదు అందించారు. అనాథ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదును అందించారు. ఇద్దరు వికలాంగుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు అందించారు.


నగదు బహుమతులతో విద్యార్థులు

ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ నమోదుకు హెల్ప్‌లైన్ సెంటర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్స్ నమోదుకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల జనరల్ కంప్యూటర్ సెంటర్(జిసిసి)లో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు తెలిపారు. బుధవారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ నమోదులో విద్యార్థులు తమ ఇష్టమైన గ్రూపులు, తాము చేరాలనుకున్న కళాశాలలు అందుకు సంబంధించి సక్రమంగా నమోదు చేసుకునేందుకు అనుభవిజ్ఞులైన నిపుణులతో జనరల్ కంప్యూటర్ సెంటర్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డెవలప్‌మెంట్ విభాగం హెడ్, ఐటి డిపార్ట్‌మెంట్ హెడ్, జిసిసి సెంటర్ ఇన్‌ఛార్జి డాక్టర్ బిహెచ్‌విఎన్.రామకృష్ణమరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన వి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఆచంట

మహిళలు అపోహలు వీడి తమ బిడ్డలకు తల్లిపాలు పట్టిస్తే వారు భవిష్యత్తులో ఆరోగ్యవంతంగా ఉంటారని ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్‌ఎన్ ఎస్.వీరమ్మ అన్నారు. ఆచంట వేమవరం పంచాయతీ కార్యాలయం వద్ద తల్లిపాల వారోత్సవాల ర్యాలీని సర్పంచి జక్కంశెట్టి చంటి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరమ్మ మాట్లాడుతూ తల్లి శిశువుకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా పాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కల్పిస్తున్న ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిపాలు తాగిన వారిలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తొమ్మిది నెలల వరకు పాలు ఇవ్వడం శ్రేయస్కరమన్నారు. మహిళలు ఎక్కువ క్యాలరీలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సొసైటీ ఛైర్‌పర్సన్ వీరభద్రం, ఎఎన్‌ఎం రాజ్‌కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.విజయలక్ష్మి, కె.నాగలక్ష్మి, ఎ.సత్యవతి పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని పెనుగొండ అంగన్‌వాడీ సబ్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెనుగొండ సర్పంచి నక్క శ్యామలసోనియా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామలింగేశ్వరరావు, ఎఎన్‌ఎం వాసవి, కుసుమ, పి.సరస్వతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట : గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైఎస్ఆర్ పోషకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామంలోని 30 మంది బాలింతాలు, గర్భిణులకు వైఎస్ఆర్ పోషకాలను బుధవారం అందించారు. అనంతరం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎంపిటిసి సభ్యులు బేబీ రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పోలిశెట్టి దుర్గాభవాని, సల్లపూడి సుజాత, కోట రజిని పాల్గొన్నారు.


తణుకు రూరల్ : దువ్వలో తల్లిపాల వారోత్సవాలు

తణుకు రూరల్ : తల్లి పాలు బిడ్డకు మొదట వేసే సహజ సిద్ధమైన టీకా అని దువ్వ ఆరోగ్య పర్యవేక్షకురాలు బి దుర్గాకుమారి అన్నారు. బుధవారం దువ్వ గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం వద్ద తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాకుమారి మాట్లాడుతూ.. ముర్రుపాలు లోని కొలస్ట్రాము వ్యాధి నిరోధక శక్తి కలిగిస్తుందన్నారు. ఆరోగ్య సహాయకులు ఎంపి వెంకట్రావు మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు సంజీవని, 6వ నెల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వ ఎంఎల్‌హెచ్‌పి రూపావతి, ఎఎన్‌ఎం సూర్యకుమారి, హెల్త్ అసిస్టెంట్ రాంకుమార్, అంగన్వాడీ టీచర్లు యు జయంతి, వెంకటలక్ష్మీ, పుష్పభాగ్యం, మాధవిదేవి, ఆశా కార్యకర్తలు నాగమణి, పద్మావతి, విజయలక్ష్మీ, వెంకటలక్ష్మీ తదితరుల పాల్గొన్నారు. వేల్పూరు గ్రామం పిహెచ్‌సి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు 69, 90లలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.కృష్ణకుమారి, ఎఎన్‌ఎం కనకమేరి, ఆరోగ్య సిబ్బంది మాధురి, అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త వి.లలితకుమారి, రోజాలక్ష్మి పాల్గొన్నారు.

గణపవరం : బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు ఇవ్వటం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పిప్పర ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ప్రియాంక అన్నారు. సిహెచ్ అగ్రహారంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడారు.

నేడు పాలకొల్లులో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

మణిపూర్‌లో జరిగిన మారణకాండకు నిరసనగా పాలకొల్లు తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి సారథ్యంలో ఈ నెల మూడో తేదీ గురువారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సంఘ పెద్దలు ఎబినేజర్ చెప్పారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడార. పూలపల్లి అంబేద్కర్ భవన్ నుంచి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో హిందూ, ముస్లిం సంస్థలు, మానవతావాదులు కూడా పాల్గొంటున్నారని చెప్పారు. మణిపూర్‌లో జరిగిన మారణకాండకు కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అన్నారు. ఆయనతో పాటు రాపాక రత్నరాజు, మహమ్మద్ జానీ, షేక్ మహబూబ్, బాబాజీ, ఇసెక్ పాల్, పాలమూరి శామ్యూల్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పోడూరు గ్రామ పంచాయతీ పెదపేట కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచి సువర్ణరాజు బుధవారం పరిశీలించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు సహకారంతో రోడ్డును నిర్మిస్తున్నారు. సర్పంచితో పాటు చేకూరి సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు, ఎఇ ఏడుకొండలు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మహిళల పాలిట బ్రహ్మాస్త్రం దిశా యాప్

ప్రజాశక్తి - ఉండి

మహిళల పాలిట దిశా యాప్ బ్రహ్మాస్త్రంలా పని చేస్తుందని ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు అన్నారు. ఉండి మార్కెట్ ప్రాంతంలో దిశా యాప్‌పై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సిఎం జగన్ దిశా నిర్దేశం ప్రకారం మహిళలకు రక్షణ ఏర్పాటు కోసం పోలీస్ శాఖ దిశా యాప్‌ను రూపొందించిందన్నారు. ప్రతిఒక్కరూ తమ సెల్ ఫోన్లలో దిశాయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

'రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన జగన్'

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రంలో అభివృద్ధి, పరిశ్రమలు లేకుండా రూ.వేలాది కోట్లు అప్పుగా తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. మండలంలోని అర్తమూరు గ్రామంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన బుధవారం నిర్వహించిన మహిళా శక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, పార్టీ గ్రామ అధ్యక్షులు గోనబోయిన రామకృష్ణ, చెన్నంశెట్టి హరినాయుడు పాల్గొన్నారు.

టిడిపితోనే మంచి భవిష్యత్తు

ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపుతోనే ప్రజల ఆశలు నెరవేరుతాయని, సమస్యలు తీరుతాయని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని మాదివాడ గుమ్ములూరు సెంటర్ ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. మహిళల కోసం పార్టీ అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బోలా వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ, ఆ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా జల జీవన్ మిషన్ పనులు

గణపవరం : ముప్పర్తిపాడులో జల జీవన్ మిషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని గ్రామ సర్పంచి కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గ్రామంలో తాగునీటి సమస్య లేదని వివరించారు. పంచాయతీ ఆధ్వర్యంలో రెండుపూటలా ట్యాంకు ద్వారా గ్రామస్తులకు తాగునీరు అందిస్తున్నామని చెప్పారు.